సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం। 27 । జూన్ । 2025



అ'సమగ్ర' ప్రాజెక్ట్

సమగ్ర శిక్షా అభియాన్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఇది విద్యార్థులపై ప్రభావం చూపుతోంది.

- 8లో



మృత్యు అలలు

చేపల వేటకు వెళ్లి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. గొలుగువానిపేటలో ఘటన జరిగింది.

- 8లో

మందుబాబులకు రూ.10వేలు జరిమానా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి తొమ్మిది మంది పట్టుబడ్డారు. వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ గురువారం పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి తీర్పునిచ్చారని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

'వార్డు సభ్యులకు తెలుపకుండా పనులేంటి..?'

టెక్కలి: మేజర్ పంచాయతీలో వార్డు సభ్యుల ప్రమేయం లేకుండా అధికార పార్టీ కార్యకర్తలు గుర్తించిన పనులకు ఎట్టి పరిస్థితుల్లో ఆమోదం తెలియజేసేది లేదని పంచాయతీ వార్డు సభ్యులు ముక్త కంఠంతో స్పష్టం చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీలో ఇటీవల గుర్తించిన కొన్ని రకాల పనులపై ఈఓ వెంకటరావు ప్రస్తావించగా, సభ్యులంతా వ్యతిరేకించారు. పంచాయతీ పరిధిలో వార్డు సభ్యులకు తెలియకుండా ఇష్టానుసారంగా అధిక మొత్తంలో ప్రతిపాదనలు చేసి పనులు గుర్తించారని మండిపడ్డారు. చేసిన ప్రతిపాదనలపై విచారణ చేయాలని పలువురు వార్డు సభ్యులు పట్టుబట్టారు. తమ ప్రమేయం లేకుండా గుర్తించిన పనులకు తామెలా ఆమోదం తెలియజేస్తామని ప్రశ్నించారు. దీంతో సమావేశం పూర్తి స్థాయిలో కొనసాగలేదు. సమావేశంలో సర్పంచ్ జి.సుజాత, వైస్ సర్పంచ్ జి.విశ్వశాంతిరెడ్డితో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'గిరిజన పాఠశాలలకు సౌకర్యాలు కల్పించాలి'



పాఠశాల వద్ద మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పలాస: పలాస నియోజకవర్గంలోని పలాస, మందస ప్రాంతంలోని గిరిజన పాఠశాలలకు తగిన సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కోరుతున్నారు. వారు ఈ మేరకు గురువారం వివిధ పాఠశాలలను పరిశీలించారు. చాలా పాఠశాలల్లో తగిన సదుపాయాలు లేవని, పాఠశాలలు కూడా విద్యార్థులకు అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కిల్లోయి బాలుర పాఠశాలను బాలికల పాఠశాలగా మార్పు చేశారని బాలికలు ఆ పాఠశాలలో చేరడానికి పరిస్థితులు అనుకూలంగా లేవన్నారు. చాలా మంది బాలికలు పెద్దమడికి వెళ్లిపోతున్నారని, వారిని ఇక్కడకు రప్పించే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరారు. కిల్లోయి పాఠశాల ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి తగిన ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఎస్.నారాయణరావు, ఎస్.నరిసింహులు, ఎస్.లక్ష్మణరావు, కె.రమేష్ పాల్గొన్నారు.

'రెవెన్యూ సమస్యలపై సత్వరం స్పందించాలి'



ఆర్‌ఓ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి గురువారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి తహసీల్దార్లు, హెచ్‌డీటీలు, మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి మంగళవారం తహసీల్దార్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. వారానికో మండలంతో సమావేశం నిర్వహించాలని డీఆర్‌ఓను ఆదేశించారు. ఈహెచ్‌ఎస్ ఆస్పత్రి నిర్మించేందుకు స్థలం కో సం ప్రతిపాదనలు పంపాలని సైనిక సంక్షేమ అధికారిని ఆదేశించారు. గార మండలంలో డీసీసీబీ, జలుమూరు మండలంలో వైద్య ఆరోగ్య శాఖ, గార మండలంలో డీఆర్‌డీఏ, ఎచ్చెర్లలో ఆర్టీఓ, సరుబుజ్జిలి, రణస్థలం మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, శ్రీకాకుళంలో మార్క్ ఫెడ్, పర్యాటక శాఖకు సంబంధించి భూ సమస్యలపై చర్చించారు. ఇళ్ల స్థలాలపై రీ వెరిఫికేషన్ గతంలో జరిగిందని, దీనిపై సంబంధిత తహసీల్దార్ వీఆర్‌ఓను తీసుకొని స్వయంగా స్థల పరిశీలన చేసి అక్కడ నిర్మాణాలు ప్రారంభించారా లేదా చూడాలన్నారు.

కర్మయోగి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. గ్రామ సభ, గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ రెవెన్యూ సమస్యలు తగ్గడం లేదన్నారు. సివిల్ సమస్యలపై తలదూర్చరాదని జేసీ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు జి. జయదేవి, డి.పద్మావతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలివరం వద్ద బస్సు ఎలా వెళ్లాల్సి వస్తుందో చూశారా. ఇసుక లారీల ధాటికి రోడ్డు గోతుల మయం కావడంతో బస్సు ఇలా పూర్తిగా ఒకవైపు వంగితే గానీ ముందుకు వెళ్లని ప్రమాదకర పరిస్థితి నెలకొంది.



ఆమదాలవలస మండలం తొగరాం, కలివరం గ్రామాలను కలిపే రహదారి ఇది. చూసేందుకు మట్టి కుప్పలా మారిపోయింది. రాత్రి, పగలు లేకుండా ఇసుక వాహనాలు తిరుగుతుండడంతో దారికి ఈ పరిస్థితి దాపురించింది.

దారుణాలు చూడండి..!

- ఇసుక అక్రమ రవాణాతో రూపురేఖలు కోల్పోతున్న రహదారులు
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

పీరుసాహెబ్‌వానిపేట వద్ద రోడ్డు చూశారా. ఇసుక వాహనాలు తొక్కీ తొక్కీ రోడ్డును ఇలా గుల్ల చేసి పారేశాయి. ఈ దారి గుండా వాహనాలు ప్రయాణించాలంటే ఎంత కష్టం.



ఆమదాలవలస రూరల్:

ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు దారులు దారుణాలకు ఆనవాళ్లుగా కనిపిస్తున్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని బూర్జ మండలం నారాయణపురం వరకు నాగావళి నదీతీరం పొడవునా సుమారు 30 వరకు అనధికార ఇసుక ర్యాంపులు కొనసాగుతున్నాయి. నిత్యం వందల కొద్దీ లారీలు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాలు తిరుగుతుండడంతో ఈ పల్లె దారులు తట్టుకోలేకపోతున్నాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటమే కాకుండా రహదారి పొడవునా బీటలు వారడంతో దారుల రూపురేఖలే మారిపోయాయి. దూసి నుంచి బూర్జ మండలం నారాయణపురం వరకు ఇదే పరిస్థితి.

నిబంధనలకు మించి లోడింగ్

అక్రమ ఇసుక దందా దందాలో లారీ యజమానులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. రవాణా శాఖ నిబంధనలు మేరకు ఒక్కో లారీలో 20 నుంచి 25 టన్నులకు మించి లోడింగ్ చేయరాదు. కానీ ఇక్కడ ఒక్కో లారీకి పరిమితికి మించి ఇసుక లోడింగ్ చేయటంతో రహదారులు ధ్వంసమై అధ్వానంగా మారుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన రవాణా శాఖ అధికారులు, పోలీసులు వీరివైపు కన్నెత్తి చూడడం లేదు.

బిక్కు బిక్కు మంటూ ప్రయాణాలు

బూర్జ మండలం గుత్తావల్లి నుంచి ఆమదాలవలస మండలం కొత్తవలస, దూసి మీదుగా శ్రీకాకుళం మండలం రాగోలు మీదుగా శ్రీకాకుళం పట్టణానికి ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి బస్సులతో పాటు సుమారు 60 ఆటోలపై ప్రజలు తమ ప్రయాణం సాగిస్తుంటారు. రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు.

ప్రజలతో పనిలేదు

రహదారులు ఏమైనా తమకు సంబంధం లేదన్నట్లు కూటమి నాయకులు వ్యవహరిస్తుండడం విస్మయపరుస్తోంది. రహదారులు పూర్తిగా పాడైపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నా నాయకులు, అధికారులు ఎవరూ స్పందించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రజల హక్కులు హరిస్తున్నారు..

"ప్రజల హక్కులను హరించే విధంగా కూటమి పాలకులు ఇసుక దందా చేస్తున్నారు. బూర్జ, ఆమదాలవలస మండలాలకు చెందిన సుమారు ఇరవై గ్రామాల ప్రజలు నిత్యం శ్రీకాకుళానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇసుక లారీల వల్ల రహదారి పూర్తిగా రూపురేఖలు కోల్పోయినా ఇంకా దందా చేస్తూనే ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించాలి.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త



తొగరాం వద్ద రోడ్డంతా గోతులే



దూసిపేట, పెద్దదూసి గ్రామాల వద్ద దమ్ముమడిని తలపిస్తున్న రహదారి



పీరుసాహెబ్‌వానిపేట రహదారిపై బిక్కు బిక్కుమంటూ నడిచివెళ్తున్న విద్యార్థులు



కొత్తవలస ఇసుక ర్యాంపు నుంచి క్యూకట్టిన లోడింగ్ ఇసుక లారీలు

రాజకీయ కక్ష.. కార్మికులకు శిక్ష



- వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో క్రషర్లపై ఆంక్షల పర్వం
- ఏడాదిగా అడ్డగోలు చర్యలకు పాల్పడుతున్న అధికారులు
- ఇదేనా పరిశ్రమలకు ప్రోత్సాహం అని నిలదీస్తున్న బాధిత యజమానులు



టెక్కలి : ఏడాది దాటిపోయింది. వందలాది మందికి ఉపాధి కల్పించిన క్రషర్లు నేటికీ తెరుచుకోలేదు. కేవలం వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో అధికార పార్టీ నాయకులు టెక్కలి పరిధిలో 7 క్రషర్లను మూయించేశారు. ఏడాది కాలం గడుస్తున్నప్పటికీ అధికారుల చేత వాటిపై ఇంకా ఆంక్షలు విధిస్తూనే ఉన్నారు. నియోజకవర్గంలో మంత్రి, ఆయన సోదరుడు పాల్పడుతున్న వేధింపులకు వంత పాడుతున్న మైనింగ్, ఇతర అధికారులంతా పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకోక తప్పదని, వారిపై న్యాయ పోరాటం చేస్తామని బాధిత యజమానులు హెచ్చరిస్తున్నారు.

ఏడాదిగా కక్ష సాధింపు

టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం తదితర మండలాల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో 7 క్రషర్లపై అధికారులతో దాడులు చేయించి వాటిని మూయించేశారు. టెక్కలి మండలం లింగాలవలస సమీపంలో మెట్టపేట వద్ద ఒకటి, అంజనాపురం సమీపంలో రెండు, బొరిగిపేట సమీపంలో వీర రామకృష్ణాపురం వద్ద ఒకటి, కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు ఒకటి, రేగులపాడు సమీపంలో ఒకటి, నందిగాం మండలం లట్టిగాంలో ఒక క్రషర్‌ను మూయించేశారు.

ప్రస్తుతం అధికార పార్టీకి అనుకూలంగా కొనసాగుతున్న క్రషర్లకు మైనింగ్ చట్టం ప్రకారం పూర్తి స్థాయిలో అనుమతులు లేకపోయినప్పటికీ వాటిపై మైనింగ్ అధికారులు దృష్టి సారించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వంలో ఉన్న మాదిరిగా చెక్‌పోస్టులు లేకపోవడంతో అధికార పార్టీ నేతలకు చెందిన క్రషర్ల నుంచి అడ్డగోలుగా మెటీరియల్‌ను తరలించేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ మౌనం వహిస్తున్నారు.

ఇదేనా పరిశ్రమలకు ప్రోత్సాహం..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విధానం మార్పు పేరుతో ప్రధానంగా టెక్కలి నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న గ్రానైట్ క్వారీలను కొన్ని రోజులు మూయించేశారు. దీంతో మొదట్లో వేలాది మంది కార్మికులు నడిరోడ్డున పడ్డారు. ఇదే సమయంలో క్రషర్లపై కక్ష సాధింపు చర్యలకు తెర లేపారు. అయితే ఈ ప్రభుత్వంలో నిరుద్యోగ యువత, కార్మికుల కోసం కొత్త పరిశ్రమలు స్థాపించకపోగా, ఉన్న వాటిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడంపై బాధిత యజమానులతో పాటు ఆయా రంగాలపై ఆధార పడిన వారంతా వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. నాయకుల పాల్పడిన కక్ష సాధింపు చర్యలకు ఒక వైపు గ్రామాల్లో నిరుద్యోగ యువత, కార్మికులు ఉపాధి కోల్పోగా, మరో వైపు ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది.



అచ్చెన్నాయుడు, సోదరుడు అండతోనే..

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన సోదరుడు హరివరప్రసాద్ అండతో పెద్ద ఎత్తున మైనింగ్ మాఫియా కొనసాగుతోంది. సినిమాల్లో చూపిన విధంగా మైనింగ్ అధికారులంతా వారి చెప్పు చేతల్లోకి చేరిపోయి వాళ్లకు తగ్గట్టుగా దోచుకుంటున్నారు. కింజరాపు ట్యాక్స్ కట్టిన వారికి ఎలాంటి తనిఖీలు ఉండవు. ఎదురు తిరిగిన వారిపై కక్ష కడుతున్నారు.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి



మంత్రి సోదరుడిని కలవాలని చెప్పారు

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి సోదరుడిని కలవాలని మైన్స్ అధికారులు చెప్పారు. కలవకపోవడంతో నా క్రషర్‌ను ఆపివేయించారు. ఏడాది కాలంగా క్రషర్ నిర్వహణ లేదు. ఎంతో మందికి ఉపాధిగా ఉన్న క్రషర్ ప్రస్తుతం మూతపడింది. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికే గండి పడుతుంది.

– సింగుపురం మోహనరావు, బాధిత యజమాని, టెక్కలి



కక్ష కట్టారు..

"గతంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నాననే ఒకే ఒక్క కారణంతో నాపై కక్ష కట్టి నా క్రషర్‌ను మూయించేశారు. క్రషర్ నిర్వహణలో 8 ఏళ్లుగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన అన్ని రకాల ఆదాయం చెల్లింపులు చేశాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి అండతో ఆయన సోదరుడి ఆదేశాలతో స్థానిక నాయకుల ప్రమేయంతో అధికారులతో పదే పదే దాడులు చేయించి క్రషర్‌ను మూయించేశారు. గతంలో ఇలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండేవి కావు. నా తల్లి వైఎస్సార్‌సీపీ తరఫున సర్పంచ్‌గా ఉన్నారు. నేను వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండడంతో, ఇలా కక్ష కట్టి క్రషర్‌ను మూయించేశారు.

– కిల్లి అజయ్‌కుమార్, బాధిత యజమాని, టెక్కలి



కక్ష సాధింపు చర్యలతో ఏడాదిగా మూతపడిన లింగాలవలస పంచాయతీ మెట్టపేట సమీపంలో క్రషర్

మన్యం మహిళలకే వన్‌ధన్ వికాస్ కేంద్రాలు



మాట్లాడుతున్న వెలుగు ఐటీడీఏ కూర్మారావు

మందస: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన్ ధన్ వికాస్ కేంద్రాలు కేవలం మన్యం ప్రాంత గిరిజన మహిళలకే అప్పగిస్తామని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం కొండలోగాం సచివాలయం వద్ద సర్పంచ్ సవర రోజాడిల్లీశ్వర్, ఎంపీటీసీ డిల్లీశ్వరి అధ్యక్షతన ఎంపీడీఓ వై.వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ గౌరవ వర్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిరిజన గ్రా మాలకు మంచినీరు, విద్య, వైద్యం, పౌష్టికాహారం, శానిటేషన్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ హరికృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోత్స్న, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదలరా..



జిల్లా కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన, వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకం మానవాళికి ముప్పు అని వక్తలు హెచ్చరించారు. మత్తు జీవితాలను చిత్తు చేస్తోందని ఉద్బోధించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాల వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు.

– శ్రీకాకుళం క్రైమ్

జనం మధ్యకు జగన్నాథుడు



జగన్నాథుడు నేడు జనం మధ్యకు రానున్నాడు. సుభద్ర, బలభద్ర సమేతుడై రథమెక్కి పురవీధుల్లో దర్శనమివ్వనున్నాడు. గురువారం నేత్రోత్సవంలో నవయవ్వనుడై కళకళలాడుతూ కనిపించాడు.

– సోంపేట

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారికి డాక్టరేట్



ముని రామకృష్ణను అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం అసిస్టెంట్ ప్రొఫెసర్, పరిపాలనాధికారి ముని రామకృష్ణ ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) తిరుపతి నుంచి డాక్టరేట్ పట్టా (పీహెచ్‌డీ)ను పొందారు. భాగస్వామ్య ఆధారిత సామాజిక అభ్యాసం, మార్కెట్లలో ధరల విధానాలు అనే అంశంపై డాక్టర్ కె.పి.నవీన్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేయడంతో డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.డి.జి.బాలాజీ, అకడమిక్ డీన్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, మోహనకృష్ణచౌదరి, డీన్ వెల్ఫేర్ రవి, డిప్యూటీ ఏవో డాక్టర్ గణేష్ మళ్ల తదితరులు రామకృష్ణను గురువారం అభినందించారు.

ఇంజినీరింగ్ కార్మికులకు బీసీ నేతల మద్దతు



మద్దతు తెలుపుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు తమ నైపుణ్యతతో నగరవాసులకు తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు అందిస్తున్నా వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గద్దిబోయిన కృష్ణయాదవ్ అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 43 రోజులుగా నిరసన తెలియజేస్తున్నా సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అలపాన త్రినాథరెడ్డి, కర్రి రంగాజీదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పీజీసెట్‌లో అదరగొట్టిన చెస్ చాంపియన్



చింతాడ లక్ష్మీ గాయత్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: చెస్ క్రీడలో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో అనేక పతకాలతో విజయబావుటా ఎగురవేసిన లక్ష్మీ గాయత్రి పీజీ ప్రవేశాలకుగాను నిర్వహించిన ఏపీ పీజీసెట్–2025 ఫలితాల్లో సత్తాచాటింది. హిస్టరీ సబ్జెక్టులో 100 మార్కులకుగాను 94 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. ఆమదాలవలసలోని మెట్టక్కివలస వీరి నివాసం. తండ్రి చింతాడ ప్రేమ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి సత్యవతి గృహిణి.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి: వసుంధర గ్రామంలో ఆటో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన బొమ్మాళి కేశవరావు, వసుంధర గ్రామానికి చెందిన కుంతీపాత్రో వసుంధర గ్రామ రహదారి వద్ద నడిచి వెళుతుండగా ఒడిశా రాష్ట్రం బి.సీతాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కె.గణపతి అతివేగంగా వచ్చి అదుపు తప్పి ఢీకొన్నాడు. ఈ ఘటనలో మహిళ తలకు తీవ్రగాయం కావడంతో శ్రీకాకుళం తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన కేశవరావును టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో అదుపు తప్పినట్లు పోలీసులు చెబుతున్నారు. కేశవరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అసమగ్ర ప్రాజెక్టు!



- అస్తవ్యస్తంగా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు
- సెక్టోరియల్ అధికారులు లేకుండానే నిర్వహణ
- భర్తీకి నోచుకోని సీఎంవో, జీసీడీవో, కో– ఆర్డినేటర్ పోస్టులు
- మినిస్టీరియల్ సిబ్బందితోనే కొనసాగిస్తున్న వైనం
- విద్యార్థులపై తీవ్ర ప్రభావం

శ్రీకాకుళం:

జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు.. సెక్టోరియల్ అధికారులు లేకుండానే నడుస్తోంది. కొన్ని నెలలుగా కీలక పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, మినిస్టీరియల్ సిబ్బందితోనే అన్ని విభాగాలను నిర్వహిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. 25 కేజీబీవీలను పర్యవేక్షించి అందులోని 2700 బాలికల బాగోగులను చూడాల్సిన జీసీడీవో పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉంది. కేజీబీవీలోని ఆహార బిల్లులు, ఇతర ఖర్చులతో పాటు విద్యార్థినుల సంరక్షణ బాధ్యతలు చూడాల్సింది జీసీడీవోనే. నెలకు కోటి రుపాయలపైనే జీతభత్యాలు, ఆహార బిల్లులు ఇతర ఖర్చులకు సంబంధించి లావాదేవీలు జీసీడీవో ద్వారా జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఆ బాధ్యతలన్నీ సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగి ద్వారా నిర్వహిస్తుండటంపై ఆక్షేపణలు వినిపిస్తున్నాయి.

జాప్యమెందుకో?

వాస్తవానికి రెండు కంటే ఎక్కువ సెక్టోరియల్ పోస్టులు ఖాళీగా ఉంటే తక్షణం నోటిఫికేషన్ ఇచ్చి శాస్త్రీయ విధానంలో నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్, ఎంఐఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ తమ సర్వీసును పూర్తి చేసుకొని రిలీవ్ అయ్యి పాఠశాలలకు వెళ్లిపోగా ఇప్పటికీ ఆ పోస్టులను భర్తీ చేయలేదు. కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, ప్రత్యామ్నాయ పాఠశాలల కో ఆర్డినేటర్ పోస్టులు మూడేళ్ల ఫారిన్ సర్వీస్‌తో నియామకం పొందినప్పటికీ గడువు తీరకముందే రీప్యాట్రీషన్ చేసి వేరొకరిని నియమించడం గమనార్హం. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధం. సీఎంవోగా పనిచేసిన అధికారి ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొంది వెళ్లి పోగా ఆ పోస్టును ఇప్పటికీ భర్తీ చేయలేదు.

ఎక్కడి పనులు అక్కడే..

– పాఠశాలలు పునఃప్రారంభమై రెండు వారాలు కావస్తున్నా జిల్లాలోని కొన్ని మండలాలకు కిట్లు పంపిణీ జరగలేదు. మండల స్థాయికి బూట్లు, యూనిఫామ్ చేరకపోవడమే ఇందుకు కారణం. కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ దీనిని పర్యవేక్షించాల్సి ఉండగా ఆ పోస్టు ఖాళీగా ఉండటంతో పట్టించుకునే వారే కరువయ్యారు.

– ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ప్రారంభ తరగతుల్లో 20 శాతం సీట్లు పేదలకు కేటాయించాల్సి ఉండగా ఆ పని ఇప్పటికీ పూర్తి కాలేదు. దీనిని పర్యవేక్షించాల్సిన పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో మొత్తం సీట్లు ఎన్ని, పేదలకు ఎన్ని సీట్లు ఇచ్చారన్న సమాచారం నేటికీ సేకరించలేకపోయారు.

– ప్రధానోపాధ్యాయులు సెక్టోరియల్ అధికారులుగా ఉండకూడదని 2024లో విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు శ్రీకాకుళం ఎస్ఎస్ఏలో అమలుకావడం లేదు. ముగ్గురు ఉద్యోగులు సుదీర్ఘ కాలం నుంచి ఫారిన్ సర్వీసెస్‌పై ఇదే శాఖలో కొనసాగుతున్నారు. దీనివల్ల ఆ పోస్టులు కోసం చూస్తున్న ఆశావహులు నిరాశకు గురవుతున్నారు. ఇలా ఎస్ఎస్ఏ పనితీరు ఉండటం వల్లే రాష్ట్రస్థాయిలో జిల్లా స్థానకం 26కు చేరుకుంది. ఇప్పటికైనా ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించే జిల్లా విద్యాశాఖాధికారి, ప్రాజెక్టు చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించకుంటే ఎస్ఎస్ఏ శాఖ పరిధిలోని విద్యార్థులకు తీరని నష్టం తప్పదు.

కీలక పోస్టులన్నీ ఖాళీయే..



సమగ్ర శిక్షలో జీసీడీవో, సీఎంవో, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, ఎంఎస్ కో ఆర్డినేటర్ పోస్టులు కీలకమైనవి. వీటి ద్వారానే విద్యార్థుల స్థితిగతులు, బాగోగులు పర్యవేక్షిస్తుంటారు. ఇలాంటి కీలకమైన పోస్టులు నెలల తరబడి భర్తీ చేయకపోవడం విచారకరం.

– గొంటి గిరిధర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

నిబంధనలకు తిలోదకాలు



ఎస్ఎస్ఏ ప్రాజెక్టు పనితీరు అస్తవ్యస్తంగా మారింది. రాజకీయ నాయకులు పేరు చెప్పి కొందరు ఉద్యోగులు పబ్బం గడుపుకుంటున్నారు. సెక్టోరియల్ పోస్టులను మినిస్టీరియల్ సిబ్బందితో నిర్వహింపజేస్తూ ప్రాజెక్టును ఎలా నడిపిస్తున్నారో ఏపీసీకే తెలియాలి. పీఎం జన్మాన్ పాఠశాలల పురోగతి నత్తనడకన సాగుతోంది. ఐదు కీలక పోస్టులు ఖాళీగా ఉంటే నోటిఫికేషన్ ఇవ్వకపోవడం ఆక్షేపణీయం.

– ఎస్.వి.రమణమూర్తి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉద్దాన ధ్వంస రచనకు నిరసనగా..

- ఉద్యాన యూనివర్సిటీ బోర్డు సభ్యత్వానికి బత్తిని లక్ష్మణ్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న బత్తిన లక్ష్మణరావు

మందస: పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బత్తిని లక్ష్మణ్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిత్లీ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను జగనన్న ఆదుకున్నారని, అదే విధంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన తనను ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబర్‌గా నియమించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల ఆమోదం లేకుండా ఉద్దానంలో 1394 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకొని 16 గ్రామాల ప్రజల జీవనోపాధిని దెబ్బతీయడం నచ్చలేదన్నారు. ఉద్దాన ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై రైతులతో కలిసి ఉద్యమంలో పాల్గొంటానని చెప్పారు. సమావేశంలో దున్న హరికృష్ణ, బెలమర జీవన్, మర్ల సంతోష్, పిచ్చు కిరణ్ తదితరులు పాల్గొనారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్టు



పట్టుబడిన నిందితుడు ధర్మారావుతో పోలీసులు

నందిగాం: తమ్ముడిని హత్య చేసిన ఘటనలో నిందితుడైన అన్నను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి టెక్కలి సీఐ కె.శ్రీనివాసరావు విలేకర్లకు వివరాలు వెల్లడించారు. నందిగాం మండలం కామధేనువు గ్రామానికి చెందిన కిల్లి లక్ష్మణనాయుడుకు ధర్మారావు, నీలకంఠం, తవిటయ్య అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. తన భూమిలో కొంత ఉంచుకొని మిగతాది ముగ్గురికి పంచిపెట్టాడు. పెద్దవాడైన ధర్మారావు ఎక్కువ భూమి కావాలని తరుచూ తండ్రితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 22న ధర్మారావు అడుగుతున్న ఉలిమి మడిలో రెండో కుమారుని భార్య రాములమ్మ విత్తనాలు వేస్తుండగా నిందితుడికి విషయం తెలిసింది. దీనంతటికీ కారణం చిన్న తమ్ముడు తవిటియ్యేనని, అతనిని చంపేస్తే ఏ గొడవ ఉండదని భావించాడు. పారతో ఉలిమి మడి దగ్గరకు వెళ్లి రాములమ్మతో గొడవ పడి పని ఆపితే తవిటయ్య వస్తాడని, అప్పుడు అతనిని చంపేయవచ్చని నిర్ణయించుకున్నాడు. వెంటనే పొలానికి వెళ్లి రాములమ్మతో గొడవ పడ్డాడు. తవిటయ్య రావడంతో పారతో తలపై కొట్టి కిందపడిన తర్వాత కూడా పలుమార్లు గట్టిగా కొట్టి చంపేశాడు. గురువారం నర్సిపురం వద్ద నిందితుడు ధర్మారావు కనిపించగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని సీఐ తెలిపారు. నిందితుడిని పలాస కోర్టులో హాజరుపర్చామని సీఐ చెప్పారు. ఎస్సై మహమ్మద్ ఆలీ, కానిస్టేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లకు జైలుశిక్ష

శ్రీకాకుళం రూరల్ : చాపురం పంచాయతీ బలగ రూరల్ రామిగెడ్డ వద్ద ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఏడుగురికి పాత కేసులు కూడా అదనంగా ఉండటంతో న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. వీరితో పాటు పట్టుబడిన మరో వ్యక్తికి రూ.200 జరిమానా విధించింది. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న రామిగెడ్డ వద్ద గుంటుకు మల్లికార్జునరావు (హయాతినగరం), పెండ్రాల చిన్న (గుజరాతిపేట), రాసనాల అప్పన్న (కంపోస్టుకాలనీ), అముజురి కనకరాజు (పీఎన్ కాలనీ), పొండ్రంకి లక్ష్మీవరప్రసాద్ (మంగువారితోట), మాగుపల్లి కృష్ణ (దమ్మల రెల్లివీధి), పెండ్ర అశోక్ (పెద్దరెల్లివీధి)లతో పాటు మరో వ్యక్తి జూదమాడుతూ పట్టుబడ్డారు. నేరం రుజువైనందున గురువారం శ్రీకాకుళం రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఏడుగురికి పాత చరిత్ర ఆధారంగా 20 రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని జిల్లాజైలుకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

టెక్కలి: పాడి రైతులకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో గురువారం ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల బీమా కోసం రూ.103 కోట్లు విడుదల చేశామన్నారు. 2025–26 సంవత్సరానికి 1.76 కోట్ల గొర్రెలు, 55 లక్షల మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జూలై 10 వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ పథకం అమలు చేసే క్రమంలో ఆటో కార్మికులను ఆర్థికంగా ఆదుకుంటా మని భరోసా ఇచ్చారు. వచ్చే నెల నుంచి గ్యాస్ విని యోగదారులకు ముందుగానే సబ్సిడీ జమ చేస్తామ ని తెలిపారు. కార్యక్రమంలో జేడీ కె.రాజగోపాల్, డీడీ పి.చంద్రశేఖర్, నాయకులు కె.హరివరప్రసాద్, వి.విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులు గణనీయంగా పెరిగాయి

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి క్యాన్సర్ కంటే ప్రమాదకరమని, ఆ మత్తులోనే అమాయక ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిలతో కలిసి అరసవల్లి మిల్లు కూడలి నుంచి ఆనందమయి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు డీఎస్పీ సిహెచ్ వివేకానంద, ఆర్డీవో ప్రత్యూష, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కొత్త ప్రభుత్వం వచ్చాక గంజాయి కేసులు గణనీయంగా పెరిగాయని చెప్పారు. జూన్ నుంచి పరిశీలిస్తే.. 101 కేసుల్లో 261 మందిని అరెస్టు చేసి 1938 కిలోల గంజాయిని పట్టుకున్నామని వెల్లడించారు. 2023–2024 ఏడాదితో పోల్చితే 2025లోనే గంజాయి కేసులు గణనీయంగా పెరిగాయని, దీనిని బట్టి జిల్లాలో గంజాయి వాడకం ఎక్కువైందని చెప్పవచ్చన్నారు.

ఫ్లెక్సీలో కానరాని డిప్యూటీ సీఎం



వేదికపై కట్టిన బ్యానర్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటో లేని దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : పేరుకు కూటమి ప్రభుత్వం అయినప్పటికీ జనసేనను తెలుగుదేశం పార్టీ పట్టించుకోవడం లేదనడానికి గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమమే ప్రత్యక్షంగా సాక్ష్యంగా నిలిచింది. మాదకద్రవ్యాల నిర్మూలన, వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సభలో అతిథులుగా మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. వేదిక వెనక కట్టిన బ్యానర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత, రాష్ట్ర డీజీపీ, ఇతర పోలీసు అధికారులను ప్రొటోకాల్‌పరంగా పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటో మాత్రం లేదు. తమ నాయకుడి పరిస్థితే ఇలా ఉంటే తమను ఎవరు పట్టించుకుంటారంటూ జనసేన నాయకులు గుసగుసలాడుకోవడం కనిపించింది.

చెరువులోకి పరిశ్రమ వ్యర్థ జలాలు



వ్యర్థ జలాలతో నిండిన సీతంపేట చెరువు



పరిశ్రమ వద్ద వ్యర్థ జలాలను చూపుతున్న గ్రామస్తులు

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీ సీతంపేట గ్రామానికి చెందిన చెరువులోకి బంటుపల్లి సమీపంలో ఉన్న యూబీ పరిశ్రమ వ్యర్థ జలాలు హైవే కాలువ ద్వారా వచ్చి చేరుతున్నాయని గ్రామస్తులు భావరాజు లక్ష్మణరావు, బత్తుల అన్నారావు, భావరాజు ఆనందరావు, పడాల దుర్గారావు, వంక రాంబాబు, భావరాజు రాంబాబు, రాజు, పడాల శ్రీను ఆరోపించారు. ఈ మేరకు గురువారం యూబీ పరిశ్రమ వ్యర్థ జలాలు చెరువులోకి చేరుతున్న తీరును విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యర్థ జలాల కారణంగా తీవ్రమైన దుర్వాసన రావడమే కాకుండా గ్రామమంతా ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు పాడైపోయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని చెప్పారు. చెరువులో ఉన్న చేపలు చనిపోతున్నాయని, పశువులు కూడా చెరువు నీరు తాగలేకపోతున్నాయని వాపోయారు. కాలుష్యం కారణంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని చెప్పారు. వ్యర్థ జలాల విషయమై గతంలో స్థానిక ప్రజాప్రతినిధి వద్దకు వెళితే ఆ కాలుష్య నీరు పంట పొలాలకు మంచిదేనని చెప్పడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి చెరువును పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

క్వాంటమ్ కోర్సులపై ఉన్నత స్థాయి సమీక్ష

ఎచ్చెర్ల: జనరల్ డిగ్రీ ఇంజినీరింగ్ యూజీ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు కానున్న క్వాంటమ్ సంబంధిత కోర్సులపై గురువారం ఉన్నత విద్యాశాఖ సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు వర్చువల్ మోడ్‌లో రాష్ట్రంలోని వివిధ యూనివర్శిటీల వైస్ చాన్సలర్లతో నిర్వహించిన ఈ సమావేశంలో ఎచ్చెర్ల క్యాంపస్ నుంచి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె.ఆర్ రజని, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి మాట్లాడుతూ నూతన విద్యావిధానం–2020 అఖిలభారత సాంకేతిక విద్యామండలి నిబంధనలకు అనుగుణంగా సిలబస్ రూపకల్పన జరుగుతుందన్నారు. క్వాంటమ్ కోర్సులపై అధ్యాపకులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ వివిధ వర్సిటీల్లో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు.

మృత్యు అలలు

- వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి
- గొలుగువానిపేటలో విషాదఛాయలు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

సంతబొమ్మాళి: లక్కివలస పంచాయతీ గొలుగువానిపేటకు చెందిన గొర్లి రామారావు (39) అనే మత్స్యకారుడు సముద్రంలో వేటకు వెళ్లి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులతో కలిసి రామారావు గురువారం వేకువజామున సముద్రంలో చేపలవేటకు బయలుదేరాడు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా అలల తాకిడికి బోటు బోల్తాపడింది. మత్స్యకారులంతా సముద్రంలో పడిపోగా అతి కష్టమ్మీద ఒడ్డుకు చేరుకున్నారు. రామారావు మాత్రం ఒడ్డుకు చేరకపోవడంతో మళ్లీ బోటులో వెళ్లి గాలించారు. కొద్దిసేపటి తర్వాత మృతదేహం నీటిలో తేలడంతో ఒడ్డుకు చేర్చారు. రామారావు మృతదేహం వద్ద కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇతనికి భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీ చింతల రాజులు, మత్స్యకారులు కోరారు. సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



గొరకల వైకుంఠరావు మృతదేహం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన గొరకల వైకుంఠరావు (33) గురువారం పూండి రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైకుంఠరావు రాజమండ్రిలో కూలి పనులు చేస్తుండేవాడు. ఇటీవల స్వగ్రామం వచ్చాడు. గురువారం తిరిగి రాజమండ్రి వెళ్లేందుకు పూండి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. పాసింజర్ రైలు ఎక్కే ఆతృతతో పట్టాలపై పడిపోయాడు. ఆ సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి శ్రీరాములు ఇదివరకే మృతి చెందగా, మతి స్థిమితం లేని తల్లి రాజులమ్మ, తమ్ముడు వెంకటేష్ ఉన్నారు. పూండి రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు పలాస జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

హార్డ్‌వేర్ షాపులో చోరీ



షాపును పరిశీలిస్తున్న ఎస్సై, క్లూస్‌టీమ్, పోలీసులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామం వద్ద కొలిగాం రోడ్డులో ఉన్న శ్రీమహాలక్ష్మి హార్డ్‌వేర్ షాపులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రత్తకన్న గ్రామానికి చెందిన గిన్ని వాసుదేవరెడ్డి కొలిగాం రోడ్డులో హార్డ్‌వేర్ వ్యాపారం చేస్తున్నారు. ఎప్పటిలాగానే బుధవారం రాత్రి షాపుకి తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం అటుగా రాకపోకలు చేసిన వారు షాపు తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి యజమానికి సమాచారం అందించారు. అతను వచ్చి చూసే సరికి క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.95వేలు నగదు మాయమైనట్లు గుర్తించారు. వెంటనే బాధితుడు పట్టణ ఎస్సై ముకుందరావుకు ఫిర్యాదు చేయగా పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం క్లూస్‌టీమ్ వచ్చి వివరాలు సేకరించారు.

క్రీడా పోటీలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతులు అందిస్తున్న తులసీరావు, నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని కేంద్రీయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లవకుమార్ అన్నారు. పీఎం కేంద్రీయ విద్యాలయంలో హైదరాబాద్ రీజియన్ క్రికెట్ టోర్నమెంట్ అండర్–14 బాలురు పోటీలు గురువారం నిర్వహించారు. ఏడు జట్లకు చెందిన 101 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ గుంట తులసీరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులూ ఆలోచన చేయాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, పతకాలు ప్రదా నం చేశారు. కార్యక్రమంలో పీఈటీ కె.సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.